అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయాన్ని జిల్లా ఎన్నికల అధికారి, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ భారతీ హోలీకేరి బుధవారం సందర్శించారు. నామినేషన్ ప్రక్రియకు తీసుకున్న ఏర్పాట్లు, భద్రతా చర్యలపై నియోజకవర్గ ఎన్నికల అధికారులతో చర్చించారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్లు సరిహద్దు ఏర్పాటు చేయాలని, నామినేషన్ వేసే అభ్యర్థులు, వారిని ప్రపోజ్ చేసే వ్యక్తులను తప్ప ఎవరినీ అనుమతించవద్దని సూచించారు. ఎన్నికలు సుజావుగా జరిగేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ రిటర్నింగ్ అధికారి ఎస్.పంకజ, ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ, ఏసీపీ జానకిరెడ్డి, ఈఆర్‌ఓ టి.దశరథ, ఏఆర్‌ఓ అరుణకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్ రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయ సమీపంలో భద్రతా ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ భారతీ హోలీకేరి

ఆర్‌ఓ ఆఫీసులను పరిశీలించిన హైదరాబాద్ కలెక్టర్

చాదర్‌ఘాట్: నామినేషన్ల ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో మలక్‌పేట, యాకుత్‌పురా నియోజకవర్గాల ఆర్‌ఓ కార్యాలయా లను గురువారం జిల్లా ఎన్నికల అధికారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ సందర్శించారు. నల్గొండ చౌరస్తాలోని మలక్‌పేట ఆర్‌ఓ కార్యాలయంలో, చంపాపేటలోని సైదాబాద్ మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన యాకుత్‌పురా ఆర్‌ఓ కార్యాలయంలో నామినేషన్ల కోసం చేసిన ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో మలక్‌పేట ఆర్‌ఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


యాకుత్‌పురా ఆర్‌ఓ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్

లిక్కర్ వద్దు.. వాకింగ్ ముద్దు

అందెల శ్రీరాములు యాదవ్

హుడాకాంప్లెక్స్: 'లిక్కర్ వద్దు.. వాకింగ్ ముద్దు' అని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. సరూర్‌నగర్ వీఎంహోంలో వాకర్స్‌తో కలిసి గురువారం ఉదయం ఆయన మార్నింగ్ వాక్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహేశ్వరం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తానని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. వచ్చే ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆరుట్ల సురేశ్, ప్రవీణ్, డివిజన్ అధ్యక్షుడు సిద్దు ముదిరాజ్, శివరాజ్, జంగయ్య, పరమేశ్, కార్తీక్, వీఎంహోం వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.


మార్నింగ్ వాక్‌లో పాల్గొన్న శ్రీరాములు యాదవ్

కార్యకర్తలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోం..

పహాడీషరీఫ్: బీజేపీ కార్యకర్తలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి అందెల శ్రీరాములు యాదవ్ హెచ్చరించారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో బుధవారం రాత్రి ర్యాలీ అనంతరం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు కపిల్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే ఐటీ దాడులు: కాంగ్రెస్


సమావేశంలో మాట్లాడుతున్న దేప భాస్కర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఓడిపోతుందనే భయంతోనే కాంగ్రెస్ అభ్యర్థి కార్యాలయాలపై ఇన్‌కం ట్యాక్స్ దాడులు చేయిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం ఆర్‌కేపురంలో ఆయన మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో ఎన్నికల సమయంలో ఐటీ దాడులు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఓటమి భయంతోనే కాంగ్రెస్ అభ్యర్థితో పాటు మరికొందరు కాంగ్రెస్ నేతల ఇంటిపై మంత్రి సబితారెడ్డి ఐటీ దాడులు చేయిస్తోందన్నారు. బీజేపీ–బీఆర్‌ఎస్ పార్టీలు కుమ్మక్కై కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారానికి వెళ్లనీయకుండా చేసి గెలుపును అడ్డుకోవాలని చూస్తున్నాయని భాస్కర్ రెడ్డి ఆరోపించారు. కార్యక్రమంలో రామకృష్ణ పురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పన్న గణేష్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి, కల్యాణ్ యాదవ్, పగడాల శ్రీశైలం, విజయ్, కృష్ణ, నబీ, విప్లవ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'మంత్రిపై ఆరోపణలను వెనక్కి తీసుకోవాలి'

దిల్‌సుఖ్‌నగర్: బడంగ్‌పేట మేయర్ పారిజాత నర్సింహారెడ్డి చిల్లర రాజకీయాలు మానుకోవాలని, మంత్రి సబితారెడ్డిపై చేసిన ఆరోపణలను వెంటనే వెనక్కి తీసుకోవాలని మహేశ్వరం నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ అన్నారు. గురువారం పారిజాత ఇంటిపై ఐటీ దాడులు జరిగితే అవి మంత్రి ప్రోద్బలంతోనే జరిగాయని ఆమె అనడంపై ఆయన ఆర్‌కేపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిరసన వ్యక్తం చేశారు. పారిజాత ఇతరులపై బురద జల్లే వ్యవహారం మానుకోవాలని, ఐటీ దాడులు రాష్ట్ర పరిధిలో ఉండవనే విషయం తెలుసుకొని మాట్లాలని అన్నారు. గతంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై కూడా ఐటీ దాడులు జరిగాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మీకు కాంగ్రెస్ టికెట్ రావడం, రాకపోవడం మీ పార్టీ పంచాయితీ, దానిని అందరికీ పూసి సానుభూతి పొందాలనుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, సీనియర్ నాయకులు జిల్లెల కష్టారెడ్డి, పారేపల్లి దయాకర్ రెడ్డి, కొండ్ర శ్రీనివాస్, దుబ్బాక శేఖర్, వెంకటేష్ గౌడ్, పెంబర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేత అరవింద్‌శర్మ, తదితరులు

'పేదలకు సంక్షేమ పథకాలు అందే వరకూ పోరాడతాం'


సమావేశంలో మాట్లాడుతున్న బండారు వెంకటరమణ

నాగోలు: పేదలకు సంక్షేమ పథకాలు అందే వరకూ వారి తరఫున పోరాటం చేస్తామని వైఎస్‌ఆర్‌సీపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జ్, రాష్ట్ర సేవా దల్ రాష్ట్ర అధ్యక్షుడు బండారు వెంకటరమణ అన్నారు. గురువారం కొత్తపేట మోహన్‌నగర్‌లో వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ఎన్నికల కార్యాచరణపై ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బండారు వెంకటరమణ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలకు చెందాల్సిన సంక్షేమ పథకాలు వారికి చేరడం లేదన్నారు. దళిత బంధు పూర్తిస్థాయిలో వారికి అందలేదని అన్నారు. పేదల తరఫున నిలబడి వారికి సంక్షేమ పథకాలు అందే వరకూ వారి తరఫున పోరాడతామన్నారు. సమావేశంలో వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పడమటి అశోక్ యాదవ్, ఆకారం నర్సింగ్, జవాజి జ్ఞానేశ్వర్, శివ, వర్మ, విజయ్, శివకుమార్, భరత్, రవి తదితరులు పాల్గొన్నారు.

కెరీర్‌పై యువత దృష్టి పెట్టాలి

మలక్‌పేట: అందుబాటులో ఉన్న వనరులు, అవకాశాలను సద్వినియోగం చేసుకోవడానికి కెరీర్‌పై ఎక్కువగా దృష్టి సారించాలని హైదరాబాద్ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డీవీ శ్రీనివాస్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. మూసారంబాగ్ అవంతి పీజీ కాలేజీలో గురువారం 'విద్యారంభ–2023' పేరుతో నిర్వహించిన ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ–టాక్స్ మెంటర్ డైరెక్టర్ పీఎస్ నాగరాజు, రామకృష్ణ మఠం బ్రహ్మచారి శ్యామ్ మహారాజ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌కుమార్ మాట్లాడుతూ, జీవితంలో విజయాన్ని సాధించే సామర్థ్యాన్ని, స్థిరత్వాన్ని బలపర్చుకోవాలన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ డీవీ శ్రీనివాసకుమార్

నేటి సమాజంలో సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ, మానవునిగా ఆలోచనలకు పదును పెట్టాలని డైరెక్టర్ పీఎస్ నాగరాజు అన్నారు. విద్యార్థులసాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కాలేజీ హెచ్‌ఆర్ డైరెక్టర్ డాక్టర్ జయప్రద, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఇన్‌చార్జి మోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ ముఖ ద్వారానికి శంకుస్థాపన

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ న్యూ మారుతీనగర్ కాలనీలోని శ్రీరేణుక ఎల్లమ్మ తల్లి దేవస్థానం ముఖ్యద్వార నిర్మాణానికి ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. బాబు కాంప్లెక్స్ సమీపంలో ఆలయ ముఖ ద్వారం నిర్మిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. మాజీ కార్పొరేటర్ గజ్జెల మధుసూదన్‌రెడ్డి, నాయకులు మహేష్‌యాదవ్, పవన్, గట్టు శ్రీనివాస్, రమణరెడ్డి, విజయరంగా, కాలనీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, తిరుమల్‌రెడ్డి, అజయ్, ప్రభాకర్, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ ఠాణా పరిధిలో కార్డన్ సెర్చ్

సంతోష్‌నగర్: ఎన్నికల నేపథ్యంలో సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని మోయిన్‌బాగ్‌లో కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్‌లో సౌత్, ఈస్ట్ జోన్ డీసీపీ బిరుదరాజు రోహిత్ రాజు, సంతోష్‌నగర్ ఇన్‌స్పెక్టర్ పి.శివచంద్ర, ఎస్సైలతో పాటు పోలీసులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్తీలో మోహరించి తనిఖీలు నిర్వహించారు. డీసీపీ మాట్లాడుతూ.. ఎన్నికలను పురస్కరించుకొని శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా కార్డన్ సెర్చ్‌ను నిర్వహిస్తున్నామన్నారు. ఈ సెర్చ్‌లో 81 ద్విచక్ర వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందన్నారు. 45 మందిపై ఈ–పెట్టీ కేసులను సైతం బుక్ చేయడం జరిగిందన్నారు.

రౌడీషీటర్‌కు 21 రోజుల జైలు



నాంపల్లి: న్యూసెన్స్ కేసులో న్యాయస్థానం ఓ రౌడీషీటర్‌కు 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధించింది. గురువారం రెండవ స్పెషల్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డీవీ సుబ్రహ్మణ్యేశ్వర రావు తీర్పును వెల్లడించారు. హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టంగుటూరి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాన్‌పుర ప్రాంతానికి చెందిన షేక్ మహబూబ్ కుమారుడు షేక్ అలీ అలియాస్ అలీమ్ (32) రౌడీషీటర్. న్యూసెన్స్ కేసులో అరెస్టు చేసి న్యాయస్థానం ఎదుట హాజరుపరిచారు. కాగా న్యాయస్థానం నిందితుడికి 21 రోజుల జైలు శిక్షతో పాటుగా రూ.550 జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించింది.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 23, బెండ 28, పచ్చిమిర్చి 35, కాకర 26, బీర 23, క్యాబేజీ 13, ఫ్రెంచిబీన్స్ 55, క్యారెట్ 29, దొండ 13–18, చిక్కుడు 35–55, గోకర 28, బీట్‌రూట్ 23, క్యాప్సికం 35, ఆలు 21, దోస 13, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 44, చామగడ్డ 37. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సరూర్‌నగర్ డివిజనల్ ఇంజినీర్ కే.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ ఆలిండియా రేడియో స్టేషన్, రాఘవేంద్రకాలనీ ఫీడర్ల పరిధిలోని కాలనీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

స్వయం సేవక్ నుంచి.. ఎమ్మెల్యే అభ్యర్థిగా!

ఇదీ మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి ప్రస్థానం


సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: బీజేపీ మలక్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థిపై పార్టీ శ్రేణుల్లో ఉన్న ఉత్కంఠకు ఆ పార్టీ అధిష్టానం ఎట్టకేలకు తెరదించింది. గురువారం బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించింది. నియోజకవర్గం నుంచి పోటీకి ఆరుగురు నాయకులు ప్రయత్నించగా, చివరికి సురేందర్‌రెడ్డిని టికెట్ వరించింది. రాష్ట్రీయ స్వయం సేవక్(ఆర్‌ఎస్‌ఎస్)లో వివిధ బాధ్యతలు నిర్వహించిన ఈయన ఆ తర్వాత బీజేపీలోనూ క్రియాశీలకంగా వ్యవహరించి, ప్రస్తుతం ప్రస్తుతం బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. సైదాబాద్ రెడ్డిబస్తీలో నివసించే సురేందర్‌రెడ్డి 1978లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రాథమిక శిక్ష వర్గ్‌లో చేరి అందులో 2016 వరకు కొనసాగారు. 2016 జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఆయన సతీమణి సైదాబాద్ డివిజన్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. అప్పటి నుంచి బీజేపీలో కొనసాగుతున్న ఆయన ప్రస్తుతం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా సేవలందిస్తున్నారు. సురేందర్‌రెడ్డి మహావీర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శిగానూ ఉన్నారు. సొంత పార్టీలో తీవ్ర పోటీలో సీటు దక్కించుకున్న ఆయన మలక్‌పేట ఎన్నికల బరిలోనూ గట్టి పోటీని ఎదుర్కోనున్నారు.

వివరాలు...

పేరు: సంరెడ్డి సురేందర్‌రెడ్డి
పుట్టిన తేది: 16–10–1964
విద్యార్హతలు: బీ కామ్ (ఓయూ)
కుటుంబం: భార్య, ఇద్దరు కుమారులు
వృత్తి: మహావీర్ విద్యాసంస్థల వ్యవస్థాపక కార్యదర్శి
నియోజకవర్గం: మలక్‌పేట

సామ రంగారెడ్డికే బీజేపీ ఎల్‌బీనగర్ టికెట్


సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: బీజేపీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం టికెట్ సామ రంగారెడ్డిని వరించింది. పార్టీ అధిష్టానం గురువారం ఆయన పేరును ప్రకటించింది. వ్యాపారవేత్తగా, సామాజిక సేవలో ఉన్న సామ రంగారెడ్డి 2009లో చిరంజీవి ఏర్పాటు చేసిన ప్రజారాజ్యం పార్టీ (పీఆర్‌పీ)లో చేరి రాజకీయ అరంగేట్రం చేశారు. అదే ఏడాది పీఆర్‌పీ పక్షాన ఎల్‌బీనగర్ నియోజకర్గం నుంచి పోటీ చేసి 36 వేల ఓట్లు సాధించారు. 2009 జీహెచ్‌ఎంసీ ఎన్నికల ముందు టీడీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో ఎల్‌బీనగర్ నుంచి పోటీకి తీవ్ర ప్రయత్నం చేశారు. చివరి నిమిషంలో బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్. కృష్ణయ్యను టీడీపీ బరిలోకి దించడంతో సామ రంగారెడ్డి ఆర్.కృష్ణయ్య గెలుపునకు కృషి చేశారు. 2018లో కాంగ్రెస్, టీడీపీ పొత్తులో భాగంగా ఎల్‌బీనగర్ స్థానాన్ని కాంగ్రెస్‌కు కేటాయించిన టీడీపీ అధిష్టానం..సామ రంగారెడ్డికి ఇబ్రహీంపట్నం నుంచి పోటీకి అవకాశమిచ్చింది. అక్కడ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2019లో బీజేపీలో చేరారు. 2020 నుంచి రంగారెడ్డి బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2020లో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో ఎల్‌బీనగర్‌లోని 11 డివిజన్లలో.., రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడిగా మొత్తంలో 17 డివిజన్లలో పార్టీని గెలిపించి అధిష్టానం దృష్టిని ఆకర్షించారు.

బయోడెటా...

పేరు : సామ రంగారెడ్డి
పుట్టిన సంవత్సరం : 1966
కుటుంబ నేపథ్యం: భార్య, ఇద్దరు కుమారులు
చదువు : ఇంటర్మీడియట్
నివాసం: సాహెబ్‌నగర్, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్
ప్రస్తుత పదవి: బీజేపీ రంగారెడ్డి అర్బన్‌జిల్లా అర్బన్ అధ్యక్షుడు

సంక్షేమ పథకాలపై ప్రచారం చేయండి


బూత్‌స్థాయి ఇన్‌చార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చంపాపేట/నాగోల్/హస్తినాపురం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై గడప గడపకు ప్రచారం చేయాల్సిన బాధ్యత బూత్ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లు, కమిటీ సభ్యులు, పార్టీ కార్యకర్తలపై ఉందని ఎల్‌బీనగర్ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం లింగోజిగూడ డివిజన్‌లోని కొత్తకాపు యాదవరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన చంపాపేట, లింగోజిగూడ, హస్తినాపురం డివిజన్ల బూత్ ఇన్‌చార్జ్‌లు, కోఆర్డినేటర్లు, బూత్ కమిటీ సభ్యులు, పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశానని,పార్టీ కార్యకర్తలు తన విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావు, పద్మా శ్రీనివాసనాయక్, పార్టీ ఎన్నికల ఇన్‌చార్జ్ వెంకటరెడ్డి, నాయకులు నల్లా రఘుమారెడ్డి, గజ్జల మధుసూదన్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రోజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాగోల్‌లో...

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని, ఎన్నికల అనంతరం కాలనీలో సీనియర్ సిటిజన్ భవనం నిర్మాణానికి కృషి చేస్తానని, తనను గెలిపించాలని కోరారు. నాయకులు అనంతుల రాజిరెడ్డి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు చిరంజీవి పాల్గొన్నారు.

హస్తినాపురంలో....

హస్తినాపురం డివిజన్‌లోని శ్రీబాలాజీ సంక్షేమ సంఘ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఎల్‌బీనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని మరోమారు తనను ఎమ్మెల్యే గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా రాంపల్లి నర్సింహ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నుంచి, యాదయ్య ఆధ్వర్యంలో సీపీఎం పార్టీ నుంచి పలువురు యువకులు సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీ చేరారు.

ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని..


చైతన్యపురిలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

చైతన్యపురి: ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రజల్లో భరోసా కల్పించేందుకు ప్రత్యేక కేంద్ర బలగాలతో రాచకొండ పోలీసులు చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం కవాతు నిర్వహించారు. స్వేతా గార్డెన్స్ నుంచి సాయినగర్ శివాజీ చౌక్ వరకు పలు కాలనీల మీదుగా మూడు కిలో మీటర్ల మేర ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎల్‌బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వరరావు, ఏసీపీ జానకిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేసేలా ప్రజలకు భరోసా కల్పించే ఉద్దేశంతో జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వారం రోజులుగా పోలీసు కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు సుజావుగా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చైతన్యపురి ఇన్‌స్పెక్టర్ నాగార్జున, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, అంజిరెడ్డి, ఆయా స్టేషన్ల ఎస్‌ఐలు, సిబ్బంది, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

● యాకుత్‌పురా బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి


డివిజన్ అధ్యక్షులతో సమావేశమైన సామ సుందర్‌రెడ్డి

సైదాబాద్: రాష్ట్రంలో అన్నివర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని యాకుత్‌పురా నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఐఎస్‌సదన్‌లో ఆయన యాకుత్‌పురాలోని డివిజన్‌ల అధ్యక్షులతో ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించి ఓటు అభ్యర్థించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు మెట్టు భాస్కర్‌రెడ్డి, దర్శనం నర్సింగ్‌రావు, చింతల శ్రీనివాస్, సాయిబాబా, ఎజాజ్, రజా అలీ మీర్జా, సాబేర్‌లు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో మధుయాష్కీ పూజలు


ద్వారకామయినగర్‌లోని సాయిబాబా గుడి వద్ద మహిళలతో మాట్లాడుతున్న మధుయాష్కీగౌడ్

వనస్థలిపురం: ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న సాయిబాబా మందిరంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన అక్కడ ఉన్న మహిళతో మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో హస్తం గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నక్క ఉమేష్‌యాదవ్, కాలనీ అధ్యక్షుడు ప్రభులింగం, కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కమిటీ సభ్యులు, కాలనీవాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మలక్‌పేట ప్రజలు మార్పు కోరుతున్నారు

● కాంగ్రెస్ అభ్యర్థి షేక్ అక్బర్


సమావేశంలో మాట్లాడుతున్న షేక్ అక్బర్

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని, 15 ఏళ్ల మజ్లిస్ పాలనకు చరమగీతం పాడటానికి సిద్ధంగా ఉన్నారని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ అక్బర్ అన్నారు. అక్బర్‌బాగ్‌లోని ఓ ఫక్షన్ హాల్‌లో గురువారం జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈనెల 30న జరుగనున్న ఎన్నికలకు అంతా సిద్ధం కావాలని, బూత్ స్థాయి నుంచి ప్రతీ ఓటరును కలవాలని సూచించారు. అందరూ కలిసి కట్టుగా పని చేసి విజయం పతాకం ఎగురువేయాలని కోరారు. సీనియర్ నేతలు మందడి విజయసింహారెడ్డి, ముజఫర్ అలీఖాన్‌లు మాట్లాడుతూ.. ఆరు గ్యారంటీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే మలక్‌పేట అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు. కార్యక్రమంలో డివిజన్ల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధే గుర్తింపు ఇస్తుంది: బలాల


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధే తనకు గుర్తింపు ఇస్తుందని మలక్‌పేట మజ్లిస్ పార్టీ ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. మూసారంబాగ్, ఇందిరానగర్‌లో గురువారం పార్టీ కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటించారు. కాలనీవాసులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. అత్యధిక నిధులతో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేశామన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానన్నారు. మెరుగైన సేవలు అందించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు ఇలియాస్, బాబా, సృజన, తదితరులు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తా: బ్రహ్మయ్య


సమావేశంలో పాల్గొన్న బ్రహ్మయ్య తదితరులు

నాగోలు: ఎల్‌బీనగర్ నియోజకవర్గం బీసీ కులాల ప్రతినిధిగా, స్వతంత్ర అభ్యర్థిగా తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు రజక సంఘం రాష్ట్ర నాయకుడు, బీసీ సంఘం నేత పెద్దపూర బ్రహ్మయ్య తెలిపారు. బుధవారం రాత్రి నాగోలు సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీలను చిన్న చూపు చూస్తున్నాయన్నారు. బీసీలను చిన్న చూపు చేస్తున్న, తప్పుడు వాగ్దానాలతో ప్రజలను మోసం చేస్తున్న నేతల తీరుపై ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన అన్నారు. బీసీలను మోసం చేస్తున్న వారికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పాలని కోరారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని బీసీలందరూ ఐక్యంగా బీసీ కులాల ప్రతినిధిగా పోటీ చేస్తున్న తనకు మద్దతు ఇవ్వాలని కోరారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు నాగిళ్ల యాదగిరి, పున్నాం రాములు, జూపల్లి రామకృష్ణ, వెంకటేష్, ఈడింపల్లి రమేష్, లింగం జగదీష్, వేణు, రేణుక, మంజుల, లలిత, ప్రేమలత, భాగ్య, అనురాధ, శ్వేత, సరిత పాల్గొన్నారు.

సబితారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం

హుడాకాంప్లెక్స్: అన్ని వర్గాల ప్రజలకు బీఆర్‌ఎస్ పార్టీ భరోసా అని సరూర్‌నగర్ డివిజన్‌నాయకుడు ఇంటూరి అంకిరెడ్డి, బోయిని మహేందర్‌యాదవ్‌లు తెలిపారు. గురువారం బీఆర్‌ఎస్ అభ్యర్థి సబితా ఇంద్రారెడ్డిని గెలిపించాలని కోరుతూ పంజాల అనిల్‌కుమార్‌కాలనీ, అంబేద్కర్‌నగర్ కాలనీల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి చేసిన అభివృద్ధిని చూసే ఓటు అడుగుతున్నామని, ప్రతిపక్షాలు ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతున్నారని ప్రశ్నించారు.